జనగణనలో కులగణన చేపట్టాలి

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న జనగణనలోనే కులగణన నిర్వహించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం సీట్లను కేటాయించాలని కోరారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో గురువారం జాతీయ ఓబీసీ సెమినార్ నిర్వహించారు. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని, రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇకనైనా బీసీ రిజర్వేషన్ల వర్గీకరణకు కమిషన్‌ను నియమించి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, బీసీలకు సామాజిక న్యాయం చేయాలని కోరారు. ప్రతీ సామాజికవర్గానికి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయరంగాల్లో ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య మౌలిక లక్షణమని తెలిపారు. బీసీలకు విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు కల్పించారు తప్ప రాజకీయరంగంలో కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 75 ఏండ్లలో 121సార్లు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టారు కానీ బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించే బిల్లు పెట్టలేదని మండిపడ్డారు. ఇకనైనా పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనగణనలో కులగణన నిర్వహించాలని, క్రీమీలేయర్‌ను తొలగించాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, మస్తాన్‌రావు, పార్థసారథి, నాగరాజు, లక్ష్మీనారాయణ, ఓబీసీ నేతలు దుర్గా నరేశ్, గుజ్జ కృష్ణ, మహేశ్‌యాదవ్, ప్రసాదరావు, 36 కులసంఘాలు, 28 బీసీ సంఘాలు, 18 ఉద్యోగసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కులగణనపై కుయుక్తులు

- **అశాస్త్రీయ సర్వే ఎంతమాత్రమూ చెల్లదు**
- **బీసీలపై కాంగ్రెస్ సర్కారు పెనుకుట్ర**
- **స్థానికసంస్థల్లో అగ్రవర్ణాలకు పెద్దపీట వేసేందుకే కాంగ్రెస్ ప్రయత్నాలు**
- **సుప్రీంకోర్టు నిబంధనలకు తిలోదకాలు**
- **దురుద్దేశంతోనే బీసీల జనాభా తగ్గింపు**
- **'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): 'ఇంటింటి సర్వేను కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అశాస్త్రీయంగా నిర్వహించింది. సుప్రీంకోర్టు నిబంధనలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. ఇష్టారీతిన ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేస్తూ, ఒకసారి బీసీ కమిషన్, మరోసారి డెడికేటెడ్ కమిషన్ అంటూ గందరగోళం సృష్టించింది. నిపుణుల కమిటీని, కుల గణనకు నోడల్ అధికారిని నియమించకుండా, అసంబద్ధమైన ప్రశ్నలతో ప్రజల్లో అపోహలను రేకెత్తించింది. అసమగ్రంగానే వివరాలను సేకరించింది. వెరసి నివేదికకు ఏ ప్రామాణికత లేకుండా పోయింది. ఆ నివేదిక ఆధారంగా స్థిరీకరించే రిజర్వేషన్లు సైతం చట్టం ముందు నిలబడే పరిస్థితిలేదు. అగ్రవర్ణాలకు పెద్దపీట వేసేందుకే కాంగ్రెస్ కుట్రపూరితంగానే ఈ సర్వేను నామమాత్రంగా నిర్వహించింది' అంటూ తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ధ్వజమెత్తారు. ఇంటింటి సర్వే నివేదికకు ఎలాంటి సాధికారత లేదని తేల్చిచెప్పారు. ఆయా అంశాలపై 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇంటింటి సర్వేకు ప్రామాణికత ఎంత?

వాస్తవంగా జనాభా గణన, సర్వే రెండూ వేర్వేరు. జనాభా గణన అంటే మొత్తం ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించడం. సర్వే అనేది నిర్దిశిత లక్ష్యాలతో ఏదైనా ఒక అంశానికి సంబంధించింది. జనాభా గణన అంశం అనేది 7వ షెడ్యూల్‌లో కేంద్రం జాబితాలోని అంశం. జనాభా గణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికి మాత్రమే ఉన్నది. సర్వేలను రాష్ట్ర ప్రభుత్వాలు నియమిత పరిమితులకు లోబడి నిర్వహించుకోవచ్చు. గణాంకాల సేకరణ చట్టం 2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. ఆ గణాంకాల సేకరణకు నిబంధనలు సూచించింది. ఉదాహరణకు ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసి, నోడల్ ఆఫీసర్‌ను నియమించాలి. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, నేషనల్ స్టాటిస్టిక్స్ కార్యాలయాల నుంచి నవీకరించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల మ్యాప్‌లను, ఇండ్ల జాబితాలను సేకరించాలి. ప్రశ్నావళి రూపకల్పన, సర్వే నిర్వహణపై సలహాలు, సూచనలు తీసుకునేందుకు నిపుణుల కమిటీనీ ఏర్పాటుచేయాలి. ఆ సర్వేకు, డాటాకు ప్రామాణికత ఉంటుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం అందులో ఏ ఒక్క దానిని అనుసరించలేదు. ప్రభుత్వ అజమాయిషీలో పనిచేసే ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించింది. దీనికి ప్రామాణికత ఉండబోదు. ఈ సర్వే న్యాయస్థానాల ఎదుట చెల్లుబాటు కావడం కష్టమే. బీహార్ తదితర రాష్ట్రాల అనుభవాలే అందుకు ఉదాహరణలు.

సర్వే సజావుగా సాగలేదన్న విమర్శలు నిజమేనా?

అవుననే చెప్పాలి. ఎన్యుమరేటర్లకు సరైన శిక్షణ ఇవ్వలేదు. ప్రామాణికమైన ఇండ్ల జాబితాను ఇవ్వలేదు. గణకులే స్వచ్ఛందంగా ఇండ్ల స్టిక్కరింగ్ చేశారు. గృహ యజమానులు అంగీకరించిన ఇండ్లకే స్టిక్కర్లు వేశారు. విముఖత చూపిన వారి ఇండ్లను వారు మినహాయించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇండ్లను మినహాయించారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో మరింత దారుణంగా సాగింది. సగానికిపైగా ఇండ్లను సర్వే చేయలేదనే తెలుస్తున్నది. స్టిక్కరింగ్ చేసిన ఇండ్ల యజమానులు సైతం అరకొరగానే సమాచారం ఇచ్చారు. అందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళిలోని ప్రశ్నలే కారణం. గృహ యజమానులు చెప్పిన సమాచారాన్నే ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్నారు. అది వాస్తవమా? కాదా? అని పరిశీలనకు ఎక్కడా ఆస్కారం లేకుండా పోయింది. చాలామంది గృహయజమానులు ఆస్తులు, ఆదాయ వివరాలను వెల్లడించేందుకు విముఖత చూపారు. సర్వేలో పాల్గొన్న చాలామంది తమ కుటుంబీకుల వివరాలు, కులం మినహా మరే వివరాలనూ వెల్లడించేందుకు ముందుకురాలేదు. దీంతో సర్వే సజావుగా సాగలేదని తెలుస్తున్నది. ఇదే విషయాన్ని కులసంఘాలు, మేధావులు మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిబంధనలేమిటి?

స్థానిక సంస్థల్లో కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కలిగిన రిజర్వేషన్లు ఏమీ లేవు. అయితే ఇప్పటివరకు కేవలం ఆర్టికల్స్ 243-డీ(6), 243-టీ(6) ప్రకారం మాత్రమే ఇతమిత్థంగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం రిజర్వేషన్లను కల్పిస్తూ వస్తున్నాయి. ఇలా బీసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్లను కల్పించడాన్ని సవాల్ చేస్తూ కర్ణాటకకు చెందిన కే కృష్ణమూర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2010లో కీలకమైన తీర్పును ఇచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు ఆర్టికల్ 340 ద్వారా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఆ కమిషన్ మాత్రమే ఆయా వర్గాల రాజకీయ వెనుకబాటుతనాన్ని గ్రామస్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో స్వతంత్రంగా అధ్యయనం చేయాలని, ఆపై మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఓబీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ సిఫారసులు చేయాలని నిర్దేశించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు రిజర్వేషన్లను కల్పించవద్దని తేల్చిచెప్పింది. వీటినే ట్రిపుల్ టీ మార్గదర్శకాలు అంటారు. ఆ తీర్పును దేశంలోని అన్ని రాష్ట్రాలు పాటించాల్సిందేనని మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో స్పష్టంగా సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. ఇదే విషయాన్ని ఇటీవల తెలంగాణ హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి కరాఖండిగా తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కే అవకాశం ఉన్నదా?

శాస్త్రీయ పద్ధతిలో సర్వేచేసి, ప్రామాణికమైన గణాంకాలను సేకరించి సహేతుకమైన వాదనలు వినిపిస్తే అవకాశం ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ఆ స్ఫూర్తి చూపలేదు. డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది తప్ప విధులు, నిధులు ఇవ్వనేలేదు. వాస్తవంగా డెడికేటెడ్ కమిషనే గణాంకాల సేకరణతోపాటు, అధ్యయనం చేయాలి. ప్రభుత్వం ఇచ్చే గణాంకాలపై ఆధారపడి రిజర్వేషన్లను నిర్ణయించకూడదు. అది సుప్రీంకోర్టు ట్రిపుట్ టీ మార్గదర్శకాలకు విరుద్ధం. అలా స్థిరీకరించిన రిజర్వేషన్లు చెల్లబోవు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇదే రీతిన అమలు చేయబోయి బోల్తా పడ్డది. ఆ తర్వాత సుప్రీం మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకుపోయింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుచేసింది. కానీ డాటా సేకరణను ప్రణాళిక శాఖ ద్వారా చేయించింది. ప్రామాణికత లేని గణాంకాల ఆధారంగా డెడికేటెడ్ కమిషన్ సిఫారసు చేసే రిజర్వేషన్ల సిఫారసులు న్యాయపరంగా నిలబడవు. బీసీల రిజర్వేషన్లే పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. లేకపోతే బీసీ రిజర్వేషన్లకు ఎగనామం పెట్టేందుకు ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన ముందుకుపోతున్నారని భావించాల్సి వస్తుంది.

సర్వే గణాంకాలు వాస్తవ లెక్కలను ప్రతిబింబిస్తున్నాయా?

ప్రభుత్వం ఇటీవలే ఇంటింటి సర్వే నివేదికను అసెంబ్లీలో వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం జనాభా 3.70 కోట్ల మంది కాగా, వారిలో 16 లక్షల మంది (3.1శాతం) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలను సేకరించినట్టు తెలిపింది. అందులో స్థూలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాల జనాభా లెక్కలను వివరించింది. అయితే ఆ గణాంకాలేవీ వాస్తవ లెక్కలను ప్రతిబింబించడం లేదు. పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఉదాహరణకు బీసీల జనాభా శాతమే. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 4 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 57.1 శాతం, ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్ 5 ప్రకారం 58.2 శాతం బీసీ జనాభా ఉంటుందని అంచనా. ఎన్ఎస్ఎస్‌వో (నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్) 2019, 2020-21లో నిర్వహించిన 77, 78 రౌండ్ సర్వే ప్రకారం 57 శాతం ఉంటుందని అంచనా వేశాయి. కానీ ప్రస్తుతం ప్రభుత్వం నివేదించిన గణాంకాల మాత్రం రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతమే కావడం గమనార్హం. అందుకే సర్వే గణాంకాలు వాస్తవ లెక్కలను ప్రతిబింబించడం లేదు.

లోకం పోకడ

బీసీలంటే రేవంత్‌కు అంతచులకనా?

- **కామారెడ్డి డిక్లరేషన్‌కు విలువ లేకపోతే.. పత్రాలు తగలబెట్టి బీసీలకు క్షమాపణ చెప్పాలి**
- **పార్టీ పరంగా రిజర్వేషన్లంటూ రేవంత్ డ్రామా**
- **కాంగ్రెస్‌కు బలమైన నాయకులున్న చోట బీసీ జనాభాను తగ్గించి చూపించారు**
- **బీసీలకు న్యాయం జరిగేదాకా పోరాడుతాం**
- **బీఆర్ఎస్ నాయకుడు గట్టు రాంచందర్‌రావు**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): బీసీలంటే సీఎం రేవంత్‌రెడ్డికి అంత చులకన ఎందుకని బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు విరుద్ధంగా అసెంబ్లీలో కులగణన స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టారని, ఆ డిక్లరేషన్‌కు విలువ లేకపోతే ఆ పత్రాలను రేవంత్‌రెడ్డి తగలబెట్టి బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీగణన సబ్ కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్ప మరొకరు దొరకలేదా? బీసీల్లో అసలు సమర్థులు లేరా? అని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బయట చెప్పిన దానినే ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించింది తప్ప కొత్తగా చేసిందేమీ లేదని మండిపడ్డారు. రేవంత్ క్యాబినెట్‌లో ముగ్గురే అగ్రవర్ణాల వారు ఉండాలని, మిగతావారితో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో బలమైన నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల బీసీ జనాభాను తగ్గించారని, ప్రాంతాలవారీగా అన్ని కులాల జనాభాను ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు.

మోదీకి భయపడే తీర్మానం చేయలేదు

ప్రధాని మోదీకి భయపడే బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ రేవంత్ తీర్మానం చేయలేదని గట్టు రాంచందర్‌రావు విమర్శించారు. బడే భాయ్, చోటే భాయ్ రహస్య ఒప్పందం మరోమారు బయటపడిందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధంగా కాకుండా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్ మరో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని పెడితే, మరో పార్టీ ఓసీ అభ్యర్థిని పెడుతుందని, డబ్బులు ఎక్కువ ఖర్చుచేసే వ్యక్తే గెలుస్తాడని, అన్ని పార్టీలూ బీసీ అభ్యర్థులను ఒకేచోట పెట్టేలా చట్టబద్ధత ఉంటేనే న్యాయం జరుగుతుందని అన్నారు. కేసీఆర్ హయంలో సమగ్ర కుటుంబ సర్వేను ఇప్పుడున్న అధికారులే చేశారని, అప్పటికీ ఇప్పటికీ బీసీల జనాభా ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. జనాభా లెక్కల ప్రకారం ఏటా 1.3% చొప్పున పెరగాలి గాని ఎందుకు తగ్గిందని నిలదీశారు. కావాలనే కొందరి ఇండ్లకు వెళ్లకుండా బీసీల జనాభాను తగ్గించారని ఆరోపించారు. ఇది బీసీల సమస్య అని, పార్టీలకు ఆతీతంగా బీసీలు అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయం జరిగే దాకా బీఆర్ఎస్ పోరాడుతుందని చెప్పారు.

చేసిందే సర్వే.. చెప్పిందే లెక్క!

- **ప్రామాణికత లేకుండా సర్కార్ కులగణన**
- **ఏ ఆధారం లేకుండానే సమాచార సేకరణ**
- **ప్రజలిచ్చిన సమాచారం నిజమా? కాదా? అని వేరే డాటాతో పోల్చి చూసినవారే లేరు**
- **మాదిగ ఉపకులాల పరిస్థితీ ఇదే తీరు**
- **సర్వే లెక్కలకు ప్రామాణికత ఏమిటి?**
- **సామాజికవేత్తలు, బీసీ నేతల ప్రశ్న**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): 'మేము చేసిందే సర్వే.. చెప్పిందే లెక్క' అన్నట్టుగా ఉన్నది కులగణనపై కాంగ్రెస్ సర్కారు తీరు! ప్రజలు చెప్పింది నిజమా? కాదా? అని పరిశీలించేందుకు ఎలాంటి ప్రామాణికత పాటించకపోవడమే కాకుండా ఇతర డాటాతోనూ పోల్చిచూడలేదు. అరకొరగా ఇష్టారాజ్యంగా సేకరించిన వివరాలనే క్రోడీకరించి 'లెక్క తేల్చినం' అని ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటున్నది. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వివరాలనే నివేదించి చేతులు దులుపుకొన్నది. కులగణన సర్వే డాటాకు ప్రామాణికత ఏమిటని సామాజికవేత్తలు, మేధావులు, బీసీ కుల సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

నిర్ధారణ ఏదీ?

కచ్చితమైన లెక్కలు తీయాలంటే తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న గణాంకాలు, కుటుంబాల సమాచారాన్ని మరోసారి క్షేత్రస్థాయిలో సరిచూసుకుంటూ వాస్తవమేనా? కాదా? అని నిర్ధారించుకుంటూ, కొత్త కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తూ సమగ్ర సమాచారాన్ని సేకరించాలి. కానీ కాంగ్రెస్ సర్కారు ఇంటింటి సర్వేను అందుకు పూర్తి విరుద్ధంగా నిర్వహించింది. ఎన్యుమరేటర్లకు జనాభా సమాచారాన్ని, సర్వే చేయాల్సిన ఇండ్ల వివరాలను అందివ్వలేదు. కేవలం సర్వే పత్రాలనే అందజేసింది. ఎన్యుమరేటర్లే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు ఇచ్చే వివరాలనే నమోదు చేసుకురావాలని ఆదేశించింది. ఎన్యుమరేటర్లు సైతం కుటుంబ సభ్యులు చెప్పిన కులం, వృత్తి, ఆస్తులు, ఆదాయ వివరాలనే నమోదు చేసుకున్నారు. ఆ వివరాలు సరైనవేనా? కాదా? అనేది సరిపోల్చుకున్న దాఖలాల్లేవు.

సంక్లిష్టంగా ఎస్సీ ఉపకులాలు, ఎంబీసీలు

సర్వేకు గణాంకాలపై ఎస్సీ ఉపకులాలు, అత్యంత వెనకబడిన వర్గాలు (ఎంబీసీ), సంచార జాతులకు చెందిన మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో 59 షెడ్యూల్డ్ కులాలను, 32 షెడ్యూల్డ్ తెగలను ప్రభుత్వం గుర్తించింది. ఎస్సీకి సంబంధించి అనేక కులాలు ఉన్నా రెవెన్యూ అధికారులు ఇప్పటికీ ఎస్సీ మాల, లేదంటే ఎస్సీ మాదిగ కులాల పేరిట సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల జాబితాలోని అనేక కులాల వాళ్లకు ధ్రువీకరణ పత్రాలు లేవు. బీసీ 'ఏ' గ్రూపు కింద 68, బీసీ 'బీ' గ్రూపు కింద 28, బీసీ 'సీ' గ్రూపు కింద క్షైస్తవం స్వీకరించిన దళితులను, బీసీ 'డీ' గ్రూపు కింద 51, బీసీ 'ఈ' గ్రూపు కింద 14 కులాలను గుర్తించింది. బీసీలకు సంబంధించి 23 కులాలను ఆ జాబితాలోంచి తొలగించింది. ఏపీ నుంచి వలసవచ్చిన పలు బీసీ కులాలకు చెందిన ప్రజలు ఇక్కడ చెల్లుబాటయ్యే డ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు బయటపెట్టేందుకు విముఖత చూపుతూ, ఎప్పటికప్పుడు కప్పదాటు విధానాన్ని అవలంబిస్తున్నది.

డాటా ప్రైవసీ యాక్ట్ పేరిట గోప్యం

తులనాత్మక అధ్యయనం చేయకుండానే ప్రభుత్వం సర్వే నివేదికను వెల్లడించింది. పోనీ కులాలు, ఉపకులాల వారీగా జనాభా లెక్కలను ప్రకటించిందా? అంటే అదీ లేదు. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. డాటా ప్రైవసీ యాక్ట్‌ను ఉటంకిస్తూ వివరాలను గోప్యంగా ఉంచింది. రాష్ట్రంలో మొత్తం జనాభా 3.70 కోట్లు కాగా, వారిలో 16 లక్షల మంది (3.1 శాతం) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలు సేకరించినట్టు నివేదించారు. స్థూలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాల జనాభా లెక్కలు వెల్లడించారు. బీసీ జనాభా 46.25 శాతం, ముస్లిం బీసీలు 10.08 శాతం, ఓసీలు 15.79 శాతం, ఎస్టీలు 10.45 శాతమని తేల్చారు. పట్టణ జనాభా, గ్రామీణ జనాభా, వృద్ధులు, యువకులు, విద్యార్థులు, దివ్యాంగుల వివరాలు విడిగా ప్రకటించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ జనాభా తరహాలో జిల్లాల వారీ గణాంకాలను వెల్లడించలేదు.

3.1% సర్వే చేయకున్నా ఒప్పెలా?

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 3.1% మందిని సర్వే చేయకుండానే, అసంబద్ధ విధానాలను అనుసరించి, అరకొరగా సమాచారాన్ని సేకరించి, తప్పుల తడకగా రూపొందించిన గణాంకాలను వెల్లడించింది. అదే ప్రామాణికమని చెప్తుండటం బీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ గత నవంబర్‌లో ఇంటింటి సర్వేను నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తం 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 3,54,77,554 (96.9%) మందిని సర్వే చేసి వివరాలు సేకరించామని ప్రభుత్వమే అధికారికంగా వెల్లడించింది. 1.03 లక్షల ఇండ్లకు తలుపులు వేసి ఉండటం, 1.68 లక్షల కుటుంబాలు మొదట్లో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇండ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలు ఎదురయ్యాయని, 16 లక్షల జనాభా వివరాలను సేకరించలేదని తెలపడం గమనార్హం. 1.13% తప్పులనే నాడు సాకుగా చూపినా కాంగ్రెస్, ఇప్పుడు 3.1% మందిని మినహాయించిన గణాంకాలను ఎలా వెల్లడిస్తారని బీసీ వర్గాలు నిలదీస్తున్నాయి. గణాంకాలు అసంబద్ధంగా ఉన్నాయని మండిపడుతున్నారు.

సర్వే అడుగడుగునా ఎన్నికల కోణమే

కాంగ్రెస్ పార్టీ అంటేనే ద్వంద్వ విధానాలు, దగాకోరు రాజకీయాలు అంటూ బీసీ సంఘాల నేతలు, సామాజికవేత్తలు మండిపడుతున్నారు. ఓట్ల కోసమే తప్ప కులగణనపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మరోసారి తేటతెల్లమైందని, అందుకు తాజా నివేదిక నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేపడతామని, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం నిరుడు ఫిబ్రవరిలో హడావుడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకున్నదని వివరిస్తున్నారు. ఏడు నెలలపాటు ఎలాంటి సర్వే ఊసే ఎత్తలేదని మేధావులు, నిపుణులు, బీసీ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇక్కడ హడావుడిగా, ప్రణాళిక లేకుండా సర్వే చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఇంటింటి సర్వే సజావుగా కొనసాగడం లేదని ఫిర్యాదులు చేసినా స్పందించలేదంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. బీహార్‌లో కులగణన సర్వే నిర్వహించిన సమయంలో ఆ రాష్ట్ర సీఎం దాదాపు 100కుపైగా సమావేశాలు నిర్వహించారని, క్షేత్రస్థాయిలో సమస్యలు, సవాళ్లను అధిగించేందుకు సలహాలు, సూచనలు చేస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలు, ఉత్తర్వులు జారీ చేస్తూ పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేశారని చెప్తున్నారు. కానీ, రాష్ట్రంలో ఇంటింటి సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఒకటి అర సమావేశాలు నిర్వహించారు తప్ప ఎక్కడా చిత్తశుద్ధి చూపలేదని బీసీ నేతలు మండిపడుతున్నారు. ఢిల్లీ ఎన్నికల వేళ హడావుడిగా అసమగ్రమైన సర్వే నివేదికను వెల్లడించిందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు 3.1% మందిని సర్వే చేయలేదని చెప్తూనే గణాంకాలను వెల్లడించిందని, ఇది కాంగ్రెస్ చిత్తశుద్ధిలేమికి నిదర్శనమని దుయ్యబడుతున్నారు. అడుగడుగునా ఎన్నికల కోణమే తప్ప, ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎక్కడా నిజాయితీ లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సర్వేను 100% పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే నివేదికను అంగీకరించేది లేదని చెప్తున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జోగు రామన్న, చిత్రంలో పల్లె రవి, లింగయ్య యాదవ్, కిశోర్‌గౌడ్

రీ సర్వే కోరితే తప్పేంటి?

- **గణాంకాలు తప్పని రుజువు చేస్తాం.. మాతో చర్చకు రండి**
- **30 లక్షల మంది బీసీలను తగ్గించారు**
- **కులగణన కాదు.. బీసీల హననం**
- **బీఆర్ఎస్ నేతలు జోగు రామన్న, పల్లె రవి, బడుగుల లింగయ్య, కిశోర్‌గౌడ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): తప్పులతడకగా ఉన్న కులగణనపై రీ సర్వే కోరితే తప్పేంటని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. గణాంకాలు తప్పని రుజువు చేస్తామని, దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కులగణన సర్వే తప్పులతడక అని తమ పార్టీ నేతలు ఇప్పటికే గణాంకాలతో సహా నిరూపించారని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్‌తో కలిసి జోగు రామన్న మీడియాతో మాట్లాడారు. ఓ సామాజికవర్గం జనాభా ఎందుకు పెరిగింది? ఒక్క బీసీ జనాభా మాత్రమే ఎందుకు తగ్గింది? అని